RNI NO. TELTEL2010/34557
www.deshatimes.in

# దేశ టైమ్స్
DESHA TIMES
తెలుగు దిన పత్రిక
నిజం.. నిర్భయం.. నిరంతరం

నల్గొండ | ఆగస్టు 15 శనివారం 2026 | సంపుటి : 16 | సంచిక : 192 | పేజీలు : 4 | వెల రూ. 2.00/- | ఎడిటర్ : సయ్యద్ పాషా

NALGONDA | SATURDAY AUGUST 15 2026 | VOL:16 | ISSUE: 192 | PAGES:4 | Rs. 2:00 | EDITOR:SAYED PASHA

దేశ టైమ్స్
DESHA TIMES
16 సంవత్సరాలుగా వెలువడుతున్న "దేశ టైమ్స్" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాలు, మరియు మండలాల వారీగా విలేకరులు కావలెను..
సెల్ నెంబర్: 9849758280

# రాష్ట్ర మంత్రివర్గం కీలక తీర్మానాలు

హైదరాబాద్: రేపు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా రాష్ట్రంలో రేషన్ కార్డుదారులకు స్మార్ట్ కార్డులను పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని మంత్రివర్గం నిర్ణయించింది. అందుకు సంబంధించి అన్ని జిల్లాల్లో ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించింది. గతంలో రాష్ట్రంలో 2 కోట్ల 81 లక్షల మంది రేషన్ కార్డు లబ్ధిదారులుంటే.. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త రేషన్ కార్డులు జారీ చేసింది. కొత్తగా కుటుంబ సభ్యుల పేర్లను కూడా నమోదు చేసింది. 62 లక్షల మందికి కొత్తగా లబ్ధి చేకూర్చింది. రాష్ట్రంలో ప్రస్తుతం మొత్తం 3 కోట్ల 42 లక్షల మంది రేషన్ లబ్ధిదారులున్నారు. వీరికి స్మార్ట్ కార్డుల జారీకి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. గత ఏడాది నిర్వహించినట్లే.. ఈ ఏడాది కూడా



తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0 నిర్వహణకు రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో సదస్సు నిర్వహించాలని ప్రాథమికంగా తేదీలను నిర్ణయించింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, వివేక్

(మిగతా 2వ పేజీలో..)

## 'ఇన్వెస్ట్ తెలంగాణ' పేరుతో గ్లోబల్ సమ్మిట్ 2.0



హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. గత ఏడాది కంటే ఘనంగా గ్లోబల్ సమ్మిట్ నిర్వహించాలని, ఇందుకోసం కమిటీలు ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. 'ఇన్వెస్ట్ తెలంగాణ' థీమ్‌తో డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో గ్లోబల్ సమ్మిట్ 2.0ని నిర్వహించాలని.. స్టార్టప్, పరిశ్రమలు సాధించిన విజయాలపై ప్రదర్శన ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది.

## కర్ణాటకలో ప్రభుత్వ ఆస్తులపై కొత్త బిల్లు.. ఆరెస్సెస్ కార్యక్రమాలే లక్ష్యమా?

- ప్రభుత్వ స్థలాల్లో ప్రైవేట్ కార్యక్రమాల నియంత్రణకు కర్ణాటకలో కొత్త బిల్లు
- ఆరెస్సెస్'శాఖ'లు, కవాతులను లక్ష్యంగా చేసుకున్నారనే ఆరోపణలు
- బిల్లుకు రాష్ట్ర మంత్రిమండలి ఆమోదం
- ఏ సంస్థనూ లక్ష్యంగా చేసుకోలేదన్న సీఎం డీకే శివకుమార్




## రాహుల్ గాంధీకి భారీ ఊరట.. సావర్కర్ వ్యాఖ్యల కేసు కొట్టేసిన సుప్రీం

- క్రిమినల్ కేసు, దిగువ కోర్టు సమన్లు రద్దు
- యూపీ ప్రభుత్వం అనుమతి తీసుకోలేదని గుర్తించిన సుప్రీం
- 2022 భారత్ జోడో యాత్రలో రాహుల్ వ్యాఖ్యలు
- 153ఏ, 505 సెక్షన్ల కింద దిగువ కోర్టు సమన్లు
- ప్రభుత్వ అనుమతి తీసుకోలేదంటూ కేసును కొట్టివేసిన సుప్రీంకోర్టు

సావర్కర్‌పై వ్యాఖ్యలకు సంబంధించి కాంగ్రెస్ అగ్రనేత,



లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. ఆయనపై కొనసాగుతున్న క్రిమినల్ పరువునష్టం కేసును సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది.

(మిగతా 2వ పేజీలో..)

## తమిళనాడు ప్రభుత్వం, సీఎం విజయ్‌కి సుప్రీంకోర్టులో బిగ్ రిలీఫ్!

- కరూర్ తొక్కిసలాట ఘటనలో పలువురి మృతి
- మృతుల కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించాలని విజయ్ ప్రభుత్వ నిర్ణయం
- ప్రభుత్వ నిర్ణయాన్ని రద్దు చేస్తూ మద్రాస్ హైకోర్టు తీర్పు
- హైకోర్టు తీర్పును తప్పుబట్టిన సుప్రీంకోర్టు

తమిళనాడులోని కరూర్ తొక్కిసలాట దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించాలని ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని రద్దు చేస్తూ గతంలో మద్రాస్

(మిగతా 2వ పేజీలో..)



## పార్లమెంట్ సెషన్‌లో ఎదురుదెబ్బ.. దిద్దుబాటు చర్యల్లో మోదీ సర్కార్!


- కీలక బిల్లులను ఆమోదింపజేసుకోలేకపోయిన మోదీ సర్కార్
- ప్రతిపక్షాల ఐక్యతతో బీజేపీ ఆత్మరక్షణలో పడిందన్న విశ్లేషణలు
- దిద్దుబాటు చర్యల్లో భాగంగా యూపీ ఎన్నికలపై మోదీ, షా ప్రత్యేక దృష్టి

త్వరలో పార్టీ, కేంద్ర కేబినెట్‌లో మార్పులకు సన్నాహాలు



## రేషన్ కార్డులపై 'స్మార్ట్' రాజకీయం.. మోదీ ఫొటో ఎందుకు లేదంటూ బీజేపీ ఫైర్!

- ఆగస్టు 15న స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ
- సంగారెడ్డిలో కార్యక్రమాన్ని ప్రారంభించనున్న సీఎం రేవంత్‌రెడ్డి
- కార్డుపై రేవంత్, ఉత్తమ్ ఫొటోలు మాత్రమే




## 'ఇంకా ఎప్పుడు ఎదుగుతావ్ రాహుల్?'.. కాంగ్రెస్ అగ్రనేత 'హగ్' జోక్‌పై బీజేపీ ఫైర్

- మోదీ విదేశాంగ విధానం 'ఆలింగనాలకే' పరిమితమైందన్న రాహుల్
- రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ తీవ్ర విమర్శలు
- 'ఎప్పుడు ఎదుగుతావ్?' అంటూ ప్రహ్లాద్ జోషి కౌంటర్
- రాహుల్ వ్యాఖ్యలు రాజకీయ చర్చ స్థాయిని దిగజార్చాయన్న బీజేపీ

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విదేశాంగ విధానాన్ని విమర్శిస్తూ కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ తీవ్రంగా మండిపడింది. రాహుల్ గాంధీ బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వ్యక్తిగా వ్యవహరించాల్సిన తీరును మరిచిపోయారని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి విమర్శించారు. గురువారం



నిర్వహించిన కాంగ్రెస్ జాతీయ సదస్సులో రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. విదేశాంగ విధానంపై ప్రధాని మోదీకి ఉన్న అవగాహన విదేశీ నేతలను ఆలింగనం చేసుకోవడానికే పరిమితమైందన్నట్లుగా వ్యాఖ్యానించారు. వేదికపైనే కాంగ్రెస్ నేత సందీప్

(మిగతా 2వ పేజీలో..)

తెలుగు దినపత్రిక
దేశ టైమ్స్
సత్యం కోసం .... సమాజం కోసం

## రాహుల్ గాంధీకి భారీ ఊరట.. సావర్కర్ వ్యాఖ్యల కేసు కొట్టేసిన సుప్రీం

(మొదటి పేజీ తరువాయి)

కేసు కొనసాగించేందుకు ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం నుంచి తప్పనిసరిగా తీసుకోవాల్సిన అనుమతి పొందలేదని కోర్టు స్పష్టం చేసింది. జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ షీల్ నాగు ధర్మాసనం శుక్రవారం ఈ మేరకు తీర్పు ఇచ్చింది. అవసరమైన ప్రభుత్వ అనుమతి లేకుండా కేసు కొనసాగించలేమని పేర్కొంటూ రాహుల్ గాంధీ పిటిషన్‌ను అనుమతించింది. దీంతో దిగువ కోర్టు జారీ చేసిన సమన్లను కూడా రద్దు చేసింది. 2022లో మహారాష్ట్రలో సాగిన భారత్ జోడో యాత్ర సందర్భంగా రాహుల్ గాంధీ సావర్కర్‌పై వ్యాఖ్యలు చేశారు. సావర్కర్ బ్రిటీషర్లకు సేవకుడిగా వ్యవహరించారని, బ్రిటీష్ ప్రభుత్వం నుంచి పెన్షన్ తీసుకునేవారని ఆరోపించారు. ఈ వ్యాఖ్యలపై న్యాయవాది నృపేంద్ర పాండే దిగువ కోర్టును ఆశ్రయించారు. రాహుల్ వ్యాఖ్యలు పరువునష్టం కలిగించడంతో పాటు వర్గాల మధ్య విభేదాలను రెచ్చగొట్టేలా ఉన్నాయని ఫిర్యాదు చేశారు. దీంతో దిగువ కోర్టు ప్రాథమికంగా కేసు విచారణకు అర్హమైనదేనని భావించింది. భారతీయ శిక్షాస్మృతిలోని 153ఏ, 505 సెక్షన్ల కింద రాహుల్‌కు సమన్లు జారీ చేసింది. అయితే సుప్రీంకోర్టు విచారణలో కీలక లోపం బయటపడింది. ఈ సెక్షన్ల కింద కేసు కొనసాగించేందుకు అవసరమైన ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వ అనుమతి తీసుకోలేదని తేలింది. దీంతో ఆ లోపాన్ని పరిగణనలోకి తీసుకున్న సుప్రీంకోర్టు మొత్తం క్రిమినల్ ప్రొసీడింగ్స్‌ను రద్దు చేసింది.

## తమిళనాడు ప్రభుత్వం, సీఎం విజయ్‌కి సుప్రీంకోర్టులో బిగ్ రిలీఫ్!

(మొదటి పేజీ తరువాయి)

హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై సుప్రీంకోర్టు తాజాగా స్టే విధిస్తూ కీలక ఆదేశాలు ఇచ్చింది.మద్రాస్ హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై జస్టిస్ పార్దీవాలా, జస్టిస్ కె. వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేస్తూ... ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాలను ప్రశ్నించడానికి పిటిషనర్లకు గల హక్కును నిలదీసింది. దారుణమైన ఘటనలో కుటుంబానికి ఆసరాగా ఉండే ఏకైక వ్యక్తి చనిపోయినప్పుడు, వారి పిల్లలకు ప్రభుత్వం ఉద్యోగం ఇవ్వడంలో ఎలాంటి తప్పు లేదని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ స్టే ఉత్తర్వులతో బాధితుల కుటుంబాలకు ఉద్యోగాలు అందించే ప్రక్రియకు మళ్లీ మార్గం సుగమమైంది, ఇది ముఖ్యమంత్రి విజయ్ ప్రభుత్వానికి పెద్ద ఊరటగా నిలిచింది.

## 'ఇంకా ఎప్పుడు ఎదుగుతావ్ రాహుల్?'.. కాంగ్రెస్ అగ్రనేత 'హగ్' జోక్‌పై బీజేపీ ఫైర్

(మొదటి పేజీ తరువాయి)

దీక్షిత్‌ను ఆలింగనం చేసుకుని తన వ్యాఖ్యలను హాస్యంగా ప్రదర్శించారు. ఈ సందర్భంగా బీజేపీ, ఆర్ఎస్ఎస్‌ను 'జోకర్ల గుంపు'గా కూడా అభివర్ణించారు. ఈ వ్యాఖ్యలపై ప్రహ్లాద్ జోషి తీవ్రంగా స్పందించారు. "రాహుల్ గాంధీ.. ఎప్పుడు ఎదుగుతారు?" అని వ్యగ్యంగా ప్రశ్నించారు. దేశాన్ని నడిపించడానికి పరిణతి చెందిన నాయకత్వం అవసరమని, 'జోకర్స్, క్లౌన్స్' వంటి పదాలు ఉపయోగించడం ఆయన రాజకీయ అపరిపక్వతను చూపిస్తోందని అన్నారు.ప్రధాని నరేంద్ర మోదీ ప్రజలు ఎన్నుకున్న నాయకుడని జోషి పేర్కొన్నారు. కుటుంబ వారసత్వం ద్వారా మోదీ ప్రధాని కాలేదని, రాహుల్ గాంధీ వ్యాఖ్యలు ప్రధానిని మాత్రమే కాకుండా దేశ ప్రజలను కూడా అవమానించేలా ఉన్నాయని విమర్శించారు.కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ కూడా రాహుల్ గాంధీపై తీవ్ర విమర్శలు చేశారు. ఆయన వ్యాఖ్యలు హద్దులు దాటుతున్నాయని అన్నారు. రాహుల్ ప్రవర్తనపై సోనియా గాంధీ జోక్యం చేసుకోవాలని వ్యాఖ్యానించారు.బీజేపీ ఎంపీ బాన్సురీ స్వరాజ్ కూడా రాహుల్ గాంధీపై మండిపడ్డారు. ప్రధాని మోదీపై ఆయన ఉపయోగించిన భాష లోక్‌సభ ప్రతిపక్ష నేత హోదాకు తగదన్నారు. దేశానికి నిర్మాణాత్మక ప్రతిపక్షం అవసరమని, సోషల్ మీడియా మీమ్స్, రీల్స్ కోసం చౌకబారు వ్యాఖ్యలు చేసే తీరు కాదని విమర్శించారు. కేంద్ర మంత్రి సుకాంత మజుందార్ సైతం రాహుల్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ప్రధాని మోదీ, ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీపై చేసిన వ్యాఖ్యలు రాజకీయ చర్చ స్థాయిని మరింత దిగజార్చాయని పేర్కొన్నారు.

## కర్ణాటకలో ప్రభుత్వ ఆస్తులపై కొత్త బిల్లు.. ఆరెస్సెస్ కార్యక్రమాలే లక్ష్యమా?

కర్ణాటక రాజకీయాల్లో మరోసారి తీవ్ర దుమారం రేగింది. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల ప్రాంగణాలు, బహిరంగ ప్రదేశాల్లో ప్రైవేట్ సంస్థల కార్యకలాపాలను నియంత్రించేందుకు ఉద్దేశించిన కీలక బిల్లుకు రాష్ట్ర మంత్రిమండలి ఆమోదం తెలిపింది. ప్రధానంగా రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆరెస్సెస్) కార్యకలాపాలను లక్ష్యంగా చేసుకునే ఈ బిల్లును తీసుకొచ్చారన్న విమర్శల నడుమ, "కర్ణాటక ప్రభుత్వ ప్రాంగణాలు, బహిరంగ ఆస్తుల వినియోగ క్రమబద్ధీకరణ బిల్లు - 2026"ను సిద్ధరామయ్య ప్రభుత్వం అసెంబ్లీ ముందుకు తీసుకురానుంది.ప్రస్తుతం జరుగుతున్న వర్షాకాల సమావేశాల్లోనే ఈ బిల్లును ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఈ కొత్త చట్టం ప్రకారం, ప్రభుత్వ ఆస్తులు, మైదానాలు, రోడ్ల వంటి ప్రదేశాలలో ప్రైవేట్ సంస్థలు సమావేశాలు, ర్యాలీలు, 'శాఖ'లు లేదా 'పథ సంచలనాల' వంటివి నిర్వహించాలంటే తప్పనిసరిగా ముందస్తు ప్రభుత్వ అనుమతి తీసుకోవాలి. నిబంధనలను ఉల్లంఘిస్తే జరిమానాలతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు ఈ బిల్లు వీలు కల్పిస్తుంది. గతంలో ఇలాంటి కార్యకలాపాలను నియంత్రించేందుకు ప్రభుత్వం జారీ చేసిన కార్యనిర్వాహక ఉత్తర్వులపై హైకోర్టు స్టే విధించింది. ఈ నేపథ్యంలో, దానికి చట్టబద్ధత కల్పించేందుకే ఈ కొత్త బిల్లును రూపొందించినట్లు తెలుస్తోంది. అయితే, ఇది ఆరెస్సెస్ కార్యక్రమాలను కట్టడి చేయడానికేనని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. కల్బుర్గి జిల్లా చిత్తాపూర్‌లో ఆరెస్సెస్ రూట్ మార్చ్‌కు అనుమతి నిరాకరించిన ఉదంతం గతంలో వివాదాస్పదమైన సంగతి తెలిసిందే.ఈ ఆరోపణలపై ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పందిస్తూ, "ఈ బిల్లు ఏ ఒక్క సంస్థ కోసమో కాదు. ప్రభుత్వ ఆస్తులను ఎవరూ ఇష్టానుసారం వాడుకోకుండా చూడటమే మా ఉద్దేశం. నిబంధనలు అందరికీ సమానంగా వర్తిస్తాయి" అని వివరించారు.

# రాష్ట్ర మంత్రివర్గం కీలక తీర్మానాలు

(మొదటి పేజీ తరువాయి)

వెంకటస్వామి అధ్వర్యంలో సబ్ కమిటీతో పాటు సదస్సు నిర్వహణకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. గత ఏడాది తెలంగాణ రైజింగ్-2047 విజన్ను ఆవిష్కరించినట్లే.. ఈసారి ఇన్వెస్ట్ తెలంగాణ థీమ్ తో సదస్సు నిర్వహణకు ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా ఫ్యూచర్ సిటీ ప్లాన్ ఆవిష్కరించనుంది. ప్రధానంగా మన రాష్ట్రంలో డిఫెన్స్, ఏరో స్పేస్, ఫార్మా రంగాల్లో పరిశ్రమలు, పెట్టుబడులకు ఉన్న అపారమైన అవకాశాలను ప్రపంచానికి చాటిచెప్పేలా ఈసారి సదస్సు జరుగుతుంది. వివిధ రంగాల్లో ఇప్పటికే తెలంగాణ స్టార్టప్ లు, పరిశ్రమలు సాధించిన విజయాలు.. వివిధ రంగాల కొత్త ఆవిష్కరణలకు సంబంధించి ఎగ్జిబిషన్, స్టాళ్లను ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది.వానాకాలం పంటకు సంబంధించి ఏడు రకాల సన్న ధాన్యం సాగును ప్రోత్సహించి, ఆ ఏడు రకాల సాగును పెంచడానికి రైతులకు అవగాహన కల్పించాలని కేబినేట్ నిర్ణయించింది. రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీ భవనాలు, రైతు వేదికల ద్వారా విస్తృత ప్రచారం చేయాలని నిర్ణయం తీసుకుంది. ఈ ఏడాది నుంచి ఈ ఏడు రకాల సన్నాలకే రూ.500 బోనస్ చెల్లించాలని కేబినేట్ తీర్మానించింది. యాసంగి ధాన్యం సేకరణలో తెలంగాణ దేశంలోనే నెంబర్ వన్ గా నిలిచింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి 81.16 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతులకు కనీస మద్ధతు ధర చెల్లించి ప్రభుత్వం కొనుగోలు చేసింది. అందులో 63.62 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే కేంద్ర ప్రభుత్వం సేకరిస్తుంది. మిగతా 17.54 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఈ వేలం ద్వారా విక్రయించేందుకు కేబినేట్ ఆమోదం తెలిపింది. ఇటీవల మొక్కజొన్న వేలంతో రాష్ట్ర ప్రభుత్వం ఆదాయం రాబట్టుకున్న నేపథ్యంలో ఈ మిగులు ధాన్యానికి కూడా క్వింటాకు రూ.2389 బేసిక్ ప్రైస్ నిర్ణయించి.. ఈ వేలం ద్వారా ధాన్యం అమ్మాలని కేబినేట్ నిర్ణయించింది.రాష్ట్రంలోని ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్ కాలేజీలను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావడానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ప్రస్తుతం ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్ కళాశాలలు సాంకేతిక విద్యా శాఖ పరిధిలో ఉన్నాయి. వీటిని తెలంగాణ ఎడ్యుకేషన్ యాక్ట్ నుంచి తొలగించి యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలో చేర్చేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రస్తుతం పరిశ్రమల శాఖ పరిధిలో ఉన్న వీటన్నింటినీ ఇకపై శక్తి శాఖ పరిధిలోకి విలీనం చేసేందుకు క్యాబినెట్ తీర్మానించింది.ఆదిలాబాద్, నిర్మల్, ముధోల్, బోథ్, సిర్పూర్, గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో తొలివిడతగా 113 నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్స్ స్కూల్ కాంప్లెక్సు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈరోజు కొత్తగా ఆమోదించిన 7 స్కూళ్లతో కలిపి ఇప్పటివరకు 86 యంగ్ ఇండియా రెసిడెన్సియల్ స్కూల్ కాంప్లెక్స్ లకు అనుమతులు మంజూరయ్యాయి. మిగిలిన నియోజకవర్గాల్లోనూ వీలైనంత తొందరగా స్థల సేకరణ చేసి, నిర్మాణాలు చేపట్టాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఇప్పటికే నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటేడ్ స్కూళ్లను వీలైనంత వేగంగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి గారు ఆదేశించారు. నిర్మాణాలు పూర్తయిన చోట వచ్చే విద్యా సంవత్సరం నుంచే తరగతులు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని మంత్రివర్గ సమావేశం నిర్ణయించింది.కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో కాలుష్యాన్ని నియంత్రించి.. హైదరాబాద్ ను గ్రీన్ సిటీగా మార్చేందుకు రాష్ట్ర మంత్రివర్గం మరో కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్లో ప్రస్తుతం 18,766 పెట్రోల్, డీజిల్ ఆటోరిక్షాలున్నాయి. వీటిని ఈవీ (విద్యుత్తు వాహనాలుగా) మార్చేందుకు రూ.200 కోట్లతో ప్రత్యేక పథకం (తెలంగాణ ఆటో రిక్షా ఎలక్ట్రిక్ కన్వర్షన్ స్కీమ్) అమలుకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ పథకం కింద అర్హులైన ఆటో డ్రైవర్లకు ఒక్కో వాహనానికి గరిష్ఠంగా రూ.1 లక్ష 50 వేలు సబ్సిడీ అందిస్తారు. ప్రస్తుతం ఉన్న ఆటోకు విద్యుత్ కిట్ అమర్చుకోవటం లేదా పాత వాహనాన్ని స్క్రాప్ చేసి కొత్త విద్యుత్ ఆటో కొనుగోలు చేసుకునేందుకు ఈ పథకం ద్వారా అవకాశం కల్పించనున్నారు.హైదరాబాద్ సిటీ పరిధిలో ఉన్న కాలుష్య కారక పరిశ్రమలను సిటీ శివార్లకు తరలించేందుకు ఉద్దేశించిన ఎ×ూు పాలసీ దరఖాస్తుల గడువును మరో 3 నెలలు పొడిగించేందుకు కేబినెట్ నిర్ణయం. దరఖాస్తుదారుల విజ్ఞప్తుల మేరకు అక్టోబర్ 31 వరకు అప్లై చేసుకునేందుకు అవకాశం కల్పించింది. మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల ఫేజ్-×× పనుల కోసం రూ. 2,100 కోట్ల అంచనా వ్యయానికి రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. దీంతో దాదాపు లక్ష ఎకరాలకు సాగు నీరు, ఆ ప్రాంతంలో తాగు నీరు, పారిశ్రామిక అవసరాలకు ఈ ఎత్తిపోతల నుంచి అందుతుంది.గూడెం దొడ్డి పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు సామర్థ్యాన్ని 1.19 టీఎంసీ నుంచి 15 టీఎంసీలకు పెంచటంతో పాటు సోలార్ విద్యుత్ ఉత్పత్తిపై అధ్యయనం చేసేందుకు కన్సల్టెంట్ ను నియామకానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది

# పార్లమెంట్ సెషన్‌లో ఎదురుదెబ్బ.. దిద్దుబాటు చర్యల్లో మోదీ సర్కార్!

(మొదటి పేజీ తరువాయి)

పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో కీలక బిల్లులను ఆమోదింపజేసుకోవడంలో కేంద్రంలోని మోదీ ప్రభుత్వానికి అనూహ్యంగా ఎదురుదెబ్బ తగిలింది. ఎఫ్‌సీఆర్ఏ, డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ వంటి కీలక బిల్లుల విషయంలో ముందుకు వెళ్లలేకపోవడంతో బీజేపీ నాయకత్వం ఆత్మరక్షణలో పడినట్టు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ పరిణామాల నేపథ్యంలో నష్ట నివారణ చర్యలకు దిగిన ప్రధాని మోదీ, త్వరలో పార్టీలోనూ, కేంద్ర కేబినెట్‌లోనూ మార్పులకు శ్రీకారం చుట్టనున్నారని తెలుస్తోంది.విదేశీ విరాళాల నియంత్రణ చట్టం (ఎఫ్‌సీఆర్ఏ) సవరణ బిల్లును ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. అంతర్జాతీయంగానూ ఒత్తిడి రావడంతో కేంద్రం ఈ బిల్లును ప్రస్తుతానికి పక్కనపెట్టినట్టు సమాచారం. మరోవైపు, లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనకు వ్యతిరేకంగా తమిళనాడు అసెంబ్లీ తీర్మానం చేయడంతో, ఈ బిల్లుకు పరోక్షంగా మద్దతివ్వాలనుకున్న డీఎంకే కూడా పునరాలోచనలో పడింది. ఇది కూడా కేంద్రానికి ప్రతికూలంగా మారింది.కాక్రోచ్ జనతా పార్టీ నిరసనలతో ప్రతిపక్షాలు మరింత బలం పుంజుకుని ఉభయ సభలను స్తంభింపజేశాయి. ఈ పరిణామాల నేపథ్యంలో హోంమంత్రి అమిత్ షా పార్లమెంటుకు రాకపోవడం, ప్రధాని మోదీ తన కార్యాలయానికే పరిమితం కావడంతో బీజేపీ ఆత్మరక్షణలో పడిందనే విశ్లేషణలు వెలువడుతున్నాయి. ప్రతిపక్షాల దాడి సమయంలో కొందరు విధేయులైన ఎంపీలు మినహా, పార్టీ సీనియర్ నేతలు మౌనంగా ఉండటం కూడా మోదీ శిబిరంలో కలవరం రేపినట్టు తెలుస్తోంది.ఈ ఎదురుదెబ్బ నుంచి కోలుకుని, తిరిగి బలం పుంజుకునేందుకు ప్రధాని మోదీ రాబోయే మూడు నెలల్లో కీలక చర్యలు చేపట్టనున్నారని సమాచారం. వచ్చే ఏడాది ఏప్రిల్‌లో ఎన్నికలు జరగనున్న ఉత్తరప్రదేశ్‌పై మోదీ, అమిత్ షా పూర్తి దృష్టి సారించారు. ఈ దిశగానే పార్టీ, కేబినెట్‌లో మార్పులు ఉండబోతున్నాయని పార్టీ వర్గాలు అంటున్నాయి. త్వరలోనే యూపీలో భారీ ఎత్తున ఎన్డీఏ సమావేశం నిర్వహించనున్నారు.ఈ నెలాఖరులోపు పార్టీపరమైన మార్పులు, చేర్పులు ప్రకటించడంతో పాటు, కేంద్ర కేబినెట్ పునర్వ్యవస్థీకరణ ప్రక్రియను కూడా వేగవంతం చేయనున్నారని తెలుస్తోంది. అదే సమయంలో, పార్టీలో కొంతకాలంగా దూరంగా ఉంటున్న సీనియర్ నేతలను సైతం తిరిగి విశ్వాసంలోకి తీసుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగానే మాజీ స్పీకర్ సుమిత్రా మహాజన్, అహ్లువాలియా వంటి నేతలతో ప్రధాని చర్చలు జరిపినట్టు పార్టీ వర్గాలు తెలిపాయి.

## రేషన్ కార్డులపై 'స్మార్ట్' రాజకీయం.. మోదీ ఫొటో ఎందుకు లేదంటూ బీజేపీ ఫైర్!

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణలో కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి రంగం సిద్ధమైంది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15న సంగారెడ్డి వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో మంత్రులు, ప్రజాప్రతినిధులు కార్డులు పంపిణీ చేయనున్నారు. అయితే పంపిణీకి ముందే కార్డులపై రాజకీయ వివాదం మొదలైంది.

కార్డుపై ఇద్దరి ఫొటోలే..

ప్రభుత్వం విడుదల చేసిన స్మార్ట్ రేషన్ కార్డు నమూనాలో సీఎం రేవంత్‌రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఫొటోలు ఉన్నాయి. ప్రధాని నరేంద్ర మోదీ ఫొటో లేకపోవడంపై బీజేపీ నేతలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. రేషన్ బియ్యంలో కేంద్రం కీలకంగా నిధులు సమకూరుస్తున్నప్పుడు ప్రధాని ఫొటో ఎందుకు పెట్టలేదని ప్రశ్నిస్తున్నారు.

బీజేపీ నేతల ఆగ్రహం

ఎంపీ ధర్మపురి అర్వింద్ తీవ్ర విమర్శలు చేశారు. కేంద్రం అందిస్తున్న రేషన్ బియ్యంపై రాష్ట్ర ప్రభుత్వం తమ ప్రచారం కోసం సీఎం, మంత్రి ఫొటోలు పెట్టుకోవడం ఏంటని ప్రశ్నించారు. పేదలకు ఉచిత బియ్యం అందించడంలో కేంద్రం పాత్రను గుర్తించాలని డిమాండ్ చేశారు.

'కార్డుల పంపిణీ ఆపాలి'

మరో ఎంపీ ఈటల రాజేందర్ కూడా కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. భవిష్యత్తులో ప్రభుత్వం మారితే మళ్లీ కొత్త కార్డులు ఇవ్వాల్సిన పరిస్థితి వస్తుందని వ్యాఖ్యానించారు. ఎంపీ రఘునందన్‌రావు సైతం ప్రధాని ఫొటో లేకుండా కార్డుల పంపిణీ నిలిపివేయాలని డిమాండ్ చేశారు.
సంగారెడ్డి సభపై ఉత్కంఠ ఒక్కో లబ్ధిదారుడికి అందే ఆరు కిలోల బియ్యంలో ఐదు కిలోలు కేంద్రం ఇస్తోందని రఘునందన్‌రావు పేర్కొన్నారు. మోదీ ఫొటో లేకపోవడం కేంద్రాన్ని అవమానించడమేనని ఆరోపించారు.
సంగారెడ్డి సభలో నిరసనల నేపథ్యంలో ఏదైనా అవాంఛనీయ ఘటన జరిగితే బీజేపీని బాధ్యులను చేయొద్దని హెచ్చరించారు. దీంతో రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం రాజకీయంగా ఆసక్తి రేపుతోంది.

దేశటైమ్స్
తెలుగు దినపత్రిక
సత్యం కోసం .... సమాజం కోసం
ఆగస్టు । శనివారం । 15 । 2026



# మరిపెడలో శ్రీ నేత్ర హాస్పిటల్ ప్రారంభం

**(దేశటైమ్స్) మహబూబాబాద్/మరిపెడ, ఆగస్టు 14:**

మరిపెడ మున్సిపల్ కేంద్రంలోని కార్గిల్ సెంటర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ నేత్ర హాస్పిటల్‌ను ప్రభుత్వ విప్, డోర్నకల్ శాసనసభ్యులు జాటోత్ రామచంద్రనాయక్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన వైద్య సదుపాయాలను పరిశీలించి, నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామచంద్ర నాయక్ మాట్లాడుతూ.. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు స్థానికంగానే అందుబాటులోకి రావడం అభినందనీయమన్నారు. ముఖ్యంగా కంటి సంబంధిత సమస్యలకు వైద్యం కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా మరిపెడలోనే మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి రావడం ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు అందుబాటు ధరల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఆసుపత్రి నిర్వాహకులకు





సూచించారు. మరిపెడ పరిసర ప్రాంతాల్లో కంటి సమస్యలతో బాధపడుతున్న ప్రజలకు శ్రీ నేత్ర హాస్పిటల్ సేవలు మరింత చేరువ కానున్నాయని, ఆధునిక వైద్య సదుపాయాలతో ప్రజలకు మెరుగైన చికిత్స అందించేందుకు ఆసుపత్రి యాజమాన్యం కృషి చేయాలని ఆయన ఆకాంక్షించారు. హాస్పిటల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, మండల, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రముఖులు తదితరులు హాజరై ఆసుపత్రి నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.

# మరిపెడలో కాంగ్రెస్‌కు కొత్త జోష్





**వార్డు కమిటీల ఏకగ్రీవ ఎన్నిక**
**10, 11, 13వ వార్డులకు అధ్యక్షుల ఎంపికలి**
**పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపు**

**(దేశ టైమ్స్)మహబూబాబాద్/మరిపెడ, ఆగస్టు 14:**

మరిపెడ మున్సిపల్ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ వార్డు కమిటీల నిర్మాణ ప్రక్రియలో భాగంగా నిర్వహించిన ఎన్నికల సమావేశాలు ఉత్సాహభరితంగా జరిగాయి. పార్టీ అధిష్ఠానం సూచనలు, స్థానిక నాయకుల సమన్వయంతో ఆయా వార్డుల కమిటీలను ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా 10వ, 11వ, 13వ వార్డులకు కాంగ్రెస్ పార్టీ వార్డు అధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి పాల్గొని నూతనంగా ఎన్నికైన వార్డు అధ్యక్షులను అభినందించారు. 10వ వార్డు కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా చీనా నాయక్, 11వ వార్డు అధ్యక్షుడిగా బానోత్ బాల్య నాయక్, 13వ వార్డు అధ్యక్షుడిగా వెర్మారెడ్డి వెంకట్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వార్డు స్థాయిలో పార్టీని మరింత పటిష్ఠం చేసేందుకు కమిటీలు కీలకపాత్ర పోషించాలని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు.

**ప్రజలకు అందుబాటులో ఉండాలి**

కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారం కోసం కృషి చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి సూచించారు. వార్డు స్థాయిలో పార్టీ కార్యక్రమాలను విస్తృతం చేయడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. ప్రతి కార్యకర్తను కలుపుకొని పార్టీని బలోపేతం చేయాల్సిన బాధ్యత నూతన వార్డు కమిటీ అధ్యక్షులపై ఉందన్నారు. పార్టీ కార్యకర్తలు క్రమశిక్షణతో పనిచేస్తూ కాంగ్రెస్ పార్టీ విధానాలను ప్రజలకు వివరించాలని, స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నాయకుల దృష్టికి తీసుకువచ్చి వాటి పరిష్కారానికి సమిష్టిగా కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

**కార్యకర్తల్లో ఉత్సాహం**

వార్డు కమిటీల అధ్యక్షుల ఎన్నిక ఏకగ్రీవంగా జరగడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. నూతనంగా ఎన్నికైన అధ్యక్షులకు పార్టీ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు. పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు అందరూ కలిసికట్టుగా పనిచేస్తామని నూతన అధ్యక్షులు తెలిపారు. కార్యక్రమంలో టౌన్ ప్రెసిడెంట్ పానుగోతు రాంలాల్, వైస్ చైర్‌పర్సన్ కాలం సునీత రవీందర్ రెడ్డి, కౌన్సిలర్ మెరుగు రాము, కోఆప్షన్ సభ్యుడు షేక్ అజీజ్ పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ నాయకులు గంధసిరి అంబరీష్, షేక్ తాజోద్దీన్, కుడితి నరసింహారెడ్డి, ముదిరెడ్డి బుచ్చిరెడ్డి, మహ్మద్ అప్సర్, అలువాల ఉపేందర్ ప్రజాపతి, గంధసిరి బిక్షపతి, దేవరశెట్టి లక్ష్మీనారాయణ, పడిదం రాధిక, చెన్నూరు మహేష్, గుండగాని వెంకన్న, రవికాంత్, లక్ష్మారెడ్డి, అనంతగిరి శ్రీను, గంధసిరి రాములు, సయ్యద్ సర్వర్, బంక ప్రమోద్, మధు, పొన్నం వినయ్, నిర్మల్ రాజ్, ఇద్దయ్య, రామస్వామి, వాల్యా నాయక్, షేక్ సలీం, లెజెండ్ పరశు రామ్, రంజిత్, వీరభద్రం, గుండగాని ఉపేందర్, శ్రీను, పర్వీన్, బోడ రమేష్, కృష్ణమూర్తి, వెంకన్న, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# బాలల హక్కులపై అవగాహన

**వలిగొండ,ఆగస్టు14(దేశ టైమ్స్):**

మండలంలోని గోకారం ప్రభుత్వ పాఠశాలలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో బాలల హక్కులు, బాలల రక్షణ, బాల్యవివాహాలపై, ఫోక్సో చట్టంపై బాలలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా బాలల పరిరక్షణ విభాగం సోషల్ వర్కర్ మత్స్యగిరి మాట్లాడుతూ పిల్లల పైన లైంగిక వేధింపులు జరిగినట్లయితే ఫోక్సో చట్టం క్రింద కేసులు నమోదు చేస్తారని, సమాజంలో ప్రస్తుతం పిల్లల పైన అత్యాచారాలు ఎక్కువ జరుగుతున్నాయని వాటికి శిక్షలు కఠినంగా ఉన్నాయని అన్నారు. బాలకార్మికులు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, చెడు లక్షణాల వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, స్కోప్ సంస్థ ప్రతినిధి నరసింహ రాజు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# నూతన ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన శ్రీకాంత్ రెడ్డి

**వలిగొండ ఆగస్టు14(దేశ టైమ్స్)**

మండల నూతన సబ్ ఇన్స్పెక్టర్ గా ఏమిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి భాధ్యతలు స్వీకరించారు. ఈయన నల్గొండ జిల్లా వాడపల్లి ఎస్ఐగా పనిచేస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా వలిగొండ ఎస్ఐగా బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన ఎస్ఐ యుగంధర్ గౌడ్, భువనగిరి ఎస్పీ ఆఫీస్ వీఆర్ కు బదిలీ చేశారు. ఈ సందర్భంగా నూతన ఎస్ఐ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పని చేస్తామని, చట్టాన్ని ఉల్లంఘించే వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు. గంజాయి రవాణా అరికట్టేందుకు కృషి చేస్తానని, మండలంలో శాంతిభద్రతల పరిరక్షణ, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా గట్టి చర్యలు తీసుకుంటానని తెలిపారు. బదిలీపై వెళ్లిన ఎస్ఐ యుగంధర్ గౌడ్ కు పోలీస్ సిబ్బంది వీడ్కోలు పలికి నూతన ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి ఘన స్వాగతం పలికారు.




## కలకోట పెద్ద చెరువు కట్ట వద్ద ట్యాంక్‌బండ్‌కు శ్రీకారం

- **ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశాలతో అభివృద్ధి పనులను పరిశీలించిన ఖమ్మం జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర**

**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 14 (దేశ టైమ్స్):**

తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు కలకోట గ్రామంలోని పెద్ద చెరువు కట్ట వద్ద ట్యాంక్‌బండ్ నిర్మాణానికి మంజూరు లభించింది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఖమ్మం జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర కలకోట గ్రామానికి చేరుకుని పెద్ద చెరువు కట్టను పరిశీలించారు. ట్యాంక్‌బండ్ నిర్మాణానికి సంబంధించిన పనులను త్వరితగతిన ప్రారంభించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. చెరువు కట్ట పరిసరాలను పరిశీలించిన ఆయన, అభివృద్ధి పనులకు అవసరమైన చర్యలను వెంటనే చేపట్టాలని సూచించారు. గ్రామ అభివృద్ధిలో భాగంగా ట్యాంక్‌బండ్ మంజూరు కావడంపై కలకోట గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ట్యాంక్‌బండ్ మంజూరుకు కృషి చేసిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు, గ్రామ సర్పంచ్ పైడిపల్లి అనిత కిషోర్‌కు, టీపీసీసీ సభ్యులు పైడిపల్లి కిషోర్ కుమార్‌కు గ్రామ పెద్దలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



# మృతురాలి కుటుంబానికి సర్పంచ్ ఆర్థిక సాయం

**(దేశ టైమ్స్) మహబూబాబాద్/మరిపెడ ఆగస్టు 14**

కందికొండ గ్రామానికి చెందిన కొర్ని ఎల్లమ్మ మృతి చెందిన విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ తుడుసు నాగార్జున ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసి, అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం రూ.3,000 ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నాగార్జున మాట్లాడుతూ.. ఎల్లమ్మ మృతి పట్ల విచారం వ్యక్తం చేశారు. బాధలో ఉన్న కుటుంబానికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. మృతురాలి కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పిస్తూ, వారి దుఃఖంలో భాగస్వాములయ్యారు. ఈ కార్యక్రమంలో కందికొండ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు షేక్ యాకూబ్ పాషా, మాజీ అధ్యక్షుడు దువ్వ సైదులు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొని మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు.



# శ్రీ మత్స్యగిరి గుట్ట ఆలయంలో టెండర్ కు బహిరంగ వేలం

**వలిగొండ,ఆగస్టు14(దేశ టైమ్స్):**

మండలంలోని వెంకటాపురంలో గల శ్రీ మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వాయిదా పడ్డ వాహన పూజ సామాగ్రీ, కొబ్బరి చిప్పలు సమాకుర్చుకొనుటకు, వాహన టోల్ గెట్ నిర్వాహన టెండర్లను ఈ నెల 18 న మధ్యాహ్నం 12 గంటలకు

హైదరాబాద్‌లోని దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహన అధికారి వెంకటయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలవారు సకాలంలో పాల్గొనాలని ఆయన కోరారు.

తెలుగు దినపత్రిక
దేశ టైమ్స్
సత్యం కోసం .... సమాజం కోసం

# చేనేత కార్మికులకు ఆసరా పెన్షన్ లు మంజూరు చేయాలి

**వలిగొండ,ఆగస్టు14(దేశ టైమ్స్):**

అర్హత గల ప్రతి చేనేత కార్మికునికి ఆసరా ఫెన్షన్ మంజూరు చేయాలని చేనేత సంఘం జిల్లా కార్యదర్శి గుండు వెంకట్ నర్సు అన్నారు. శు క్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేరుకు పోయిన క్యాష్ క్రెడిట్ అప్పులను రద్దు చేయాలని, అర్హత గల ప్రతి కార్మికునికి నూతన ఫెన్షన్ మంజూరు చేయాలని, చేనేత సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, కేంద్ర ప్రభుత్వం చేనేత బట్టలపై జిఎస్టి విధించి చేనేతను నిర్వీర్యం చేసే కుట్ర చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గర్దాసు నర్సింహా, పున్న వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.




# సరైన పత్రాలు లేని వాహనాలు సీజ్

**వలిగొండ ఆగస్టు14:(దేశ టైమ్స్)**

మండల కేంద్రంలో స్థానిక పోలీసులు వాహనాల తనిఖీలో భాగంగా మెయిన్ రోడ్డుపై ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో వాహన తనిఖీ నిర్వహించగా సరైన పత్రాలు లేని, హెల్మెట్ ధరించని, నెంబర్ ప్లేట్ లేని 10 ద్విచక్ర వాహనాలను పట్టుకొని సీజ్ చేసారు. ఈ సందర్భముగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రతిఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు.



## ‘లెఫ్టినెంట్ కల్నల్ వెంకట్ రెడ్డి’గా విక్టరీ వెంకటేశ్.. పవర్‌ఫుల్ ఫస్ట్ లుక్‌తో అంచనాలు డబుల్!

విక్టరీ వెంకటేశ్, బ్లాక్‌బస్టర్ డైరెక్టర్ అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో రాబోతున్న ఐదవ సినిమాపై నెలకొన్న అంచనాలను మరింత పెంచుతూ, చిత్రబృందం ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని అభిమానులకు కానుకగా రిలీజ్ చేసిన ఈ పోస్టర్‌లో వెంకటేశ్ పవర్ ఫుల్ ఆర్మీ ఆఫీసర్ లుక్‌లో కనిపించి ఆకట్టుకున్నారు. ఈ చిత్రాన్ని 2027 సంక్రాంతికి విడుదల చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.ఈ సినిమాలో వెంకటేశ్ ‘లెఫ్టినెంట్ కల్నల్ వెంకట్ రెడ్డి’ అనే శక్తివంతమైన పాత్రలో నటిస్తున్నారు. కౌంటర్ టెర్రరిజం, బందీలను విడిపించడంలో నిపుణుడైన సైనికాధికారిగా ఆయన పాత్ర ఉండబోతోందని ఫస్ట్ లుక్ స్పష్టం చేస్తోంది. 1986లో ‘కలియుగ పాండవులు’ చిత్రంతో అరంగేట్రం చేసిన వెంకటేశ్, సినీ పరిశ్రమలో 40 ఏళ్లు పూర్తి చేసుకున్న ప్రత్యేక సందర్భంలో ఈ పోస్టర్‌ను విడుదల చేయడం విశేషం.ఇప్పటికే ఫ్2, ఫ్3, సంక్రాంతికి వస్తున్నాం, మన శంకర వరప్రసాద్ గారు.. వంటి విజయవంతమైన చిత్రాలను అందించిన ఈ కాంబోలో ఇది ఐదో సినిమా కావడంతో ప్రేక్షకులు, ట్రేడ్ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రంలో నందమూరి కల్యాణ్ రామ్ మరో హీరోగా నటిస్తుండటం అదనపు ఆకర్షణ. వీరి సరసన హీరోయిన్లుగా కీర్తి సురేశ్, కృతి శెట్టి నటిస్తున్నారు.షైన్ స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి, సురేశ్ ప్రొడక్షన్స్, జీ స్టూడియోస్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నాయి. ఫ్యామిలీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమాకు జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుగుతోందని, అనుకున్న సమయానికే చిత్రాన్ని పూర్తి చేయాలని చిత్రబృందం భావిస్తోంది. హిట్ కాంబినేషన్, భారీ తారాగణం, పండుగ సీజన్ విడుదల వంటి అంశాలతో ఈ సినిమాపై అంచనాలు ఆకాశాన్నంటుతున్నాయి.




# ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించాలి : కలెక్టర్

ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు.శుక్రవారం ఆయన జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్ తో కలిసి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించనున్న పోలీస్ పరేడ్ మైదానాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు.వేడుకలకు హాజరయ్యే వారి కి అవసరమైన అన్ని ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులకు చెప్పారు.ఈ సంవత్సరం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల కు ముఖ్యఅతిథిగా రాష్ట్ర రోడ్లు, భవనాలు సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హాజరుకానున్నారని, మంత్రి ఉదయం 9.30 గంటలకు పోలీస్ పరేడ్ మైదానంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్న వేదిక వద్దకు చేరుకున్న వెంటనే జాతీయ గేయాలపన ఉంటుందని, అనంతరం మంత్రివర్యులు జాతీయ పథకాన్ని ఆవిష్కరిస్తారని, వెంటనే జాతీయ గీతాలాపన, తదుపరి రాష్ట్ర గీతం జయ జయహే తెలంగాణ ఉంటాయని, గౌరవ వందన స్వీకరణ ఉంటుందని తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా ప్రజలను ఉద్దేశించి ఉదయం 9 గంటల 50 నిమిషాలకు గౌరవ మంత్రి సందేశం ఉంటుందని, ఉదయం 10 గంటలకు పాఠశాల విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, 10:30కు వివిధ శాఖల అభివృద్ధిని తెలిపే విధంగా రూపొందించిన శకటాల ప్రదర్శన, 10 :50 నిమిషాలకు ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంస పత్రాల ప్రధానం, 11:30 గంటలకు ఆయా శాఖల ద్వారా లబ్ధిదారులకు ఆస్తుల పంపిణీ, 11 గంటల 40 నిమిషాలకు స్టాల్స్ సందర్శన, 12 గంటలకు జాతీయ గేయం, జాతీయ గీతాలాపన తో కార్యక్రమం ముగుస్తుందని కలెక్టర్ వివరించారు.జాతీయ పతాకం ఎగరవేసే వేదిక తో పాటు, వేడుకలకు వచ్చే ప్రముఖులకు, అదే విధంగా ప్రజలకు, మీడియా ప్రతినిధులకు అవసరమైన టెంట్లు, కుర్చీలు, తాగునీరు, ఇతర ఏర్పాట్లు చేయాలని, విద్యార్థులు ప్రదర్శించే సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాటు, శకటాలను క్రమ పద్ధతిలో ఏర్పాటు చేయడం, అదేవిధంగా వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్టాల్స్ లో ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రస్ఫుటమయ్యే విధంగా చూడడం ,ప్రత్యేకించి స్టాల్స్ ,శకటాలపై ప్రదర్శించే ఫ్లెక్సీ బ్యానర్లు, హోర్డింగు లను ప్రోటోకాల్ ప్రకారం రూపొందించాలని ఆదేశించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు వివిధ శాఖల ఉద్యోగులు, అధికారులందరూ ముందుగానే హాజరుకావాలని, వారి శాఖలకు సంబంధించి అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందే పూర్తి చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పరేడ్ గ్రౌండ్ మొత్తం శుభ్రంగా ఉంచడం తో పాటు, తాగునీరు, ఇతర ఏర్పాట్లు చేయాలని, వైద్య ఆరోగ్యశాఖ ద్వారా ప్రథమ చికిత్స కేంద్రం ఏర్పాటు చేయాలని చెప్పారు. జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్ మాట్లాడుతూ స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు పోలీస్ శాఖ తరఫున అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు.రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, డిఆర్ఓ దశరథ్, నల్గొండ ఆర్డిఓ వై. అశోక్ రెడ్డి, జిల్లా అధికారులు ఉన్నారు.



# నా మాటలను వక్రీకరించారు: అనసూయ భరద్వాజ్

హిందూ ధర్మం, సనాతన ధర్మంపై గతంలో తాను చేసిన వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో తీవ్ర దుమారం రేగడంతో... సినీ నటి, యాంకర్ అనసూయ భరద్వాజ్ సోషల్ మీడియా వేదికగా స్పందించింది. తన మాటలను కొందరు కావాలనే వక్రీకరించి ఉద్దేశపూర్వకంగా నెగిటివ్ ప్రచారం చేస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది.తాను ఏ మతాన్ని కించపరచనని, అన్ని మతాలను సమానంగా గౌరవిస్తానని అనసూయ స్పష్టం చేసింది. తాను సనాతన ధర్మాన్ని పాటించే పక్కా హిందువునని, తన ధర్మం, విలువలు, విశ్వాసాల పట్ల తనకు ఎలాంటి అనుమానం లేదని పేర్కొంది. తాను చెప్పిన అసలు విషయాన్ని పక్కన పెట్టి, సనాతన ధర్మాన్ని అవమానించినట్లు ప్రచారం చేయడం సరికాదని హితవు పలికింది.అసలు ఏం జరిగిందంటే... గతంలో ఒక సందర్భంలో అనసూయ మాట్లాడుతూ.. ‘జై శ్రీరామ్’ అనే నినాదం ముసుగులో కొందరు దాడులకు తెగబడుతున్నారని, కేవలం నినాదాలు చేయడం కంటే వ్యక్తుల ప్రవర్తనే ముఖ్యమని వ్యాఖ్యానించడమే ఈ వివాదానికి కారణమైంది. సనాతన ధర్మం పేరుతో దాడులు చేయడాన్ని ప్రశ్నించిన ఆమె, తాను శ్రీరాముడినే కొలుస్తానని, ఆ భక్తితోనే తన పెద్ద కుమారుడికి హనుమంతుడి పేరు పెట్టుకున్నానని వివరించింది. ఈ వ్యాఖ్యలపై హిందూ సంఘాలు, నెటిజన్ల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవడంతో, పరిస్థితిని చక్కదిద్దేందుకు ఆమె తాజాగా ఈ వివరణ ఇచ్చింది.

Printed, Published and Owned by SAYED PASHA Printed at MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State, Published From: MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State. Editor: SAYED PASHA, RNI No. RNI NO. TEITEL 2010/34557, Cell: 9849758280